SAKSHI
- 9 DEC 2020

# బాలిక కిడ్నాప్..


చిన్నారి కావ్యశ్రీని తండ్రి చిరంజీవికి అప్పగించిన యానాం పోలీసులు

- రూ.30 వేలకు అమ్మేసిన వైనం
- పోలీసుల అదుపులో నిందితురాలు
- చాకచక్యంగా కేసును ఛేదించిన యానాం పోలీసులు

యానాం: పట్టణ పరిధిలో సోమవారం సాయంత్రం అపహరణకు గురైన బాలిక ఆచూకీని 15 గంటల్లోపు కనుగొని ఆ చిన్నారిని వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించిన యానాం పోలీసులపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. యానాం పట్టణంలోని యర్రగుంటవారి వీధిలో నివసిస్తున్న తిరుకోటి చిరంజీవి, తిరుకోటి నాగమణిల ఐదేళ్ల కుమార్తె తిరుకోటి కావ్య గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇంటివద్ద ఆడుకుంటుండగా అదృశ్యమైంది. ఆమె కనిపించకపోవడంతో తండ్రి చిరంజీవి యానాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిన్నారి ఆచూకీ కోసం యానాం సీఐ గూటం శివగణేష్, ఎస్సై రాము ఆధ్వర్యంలో కానిస్టేబుల్స్ కడలి శ్రీను, మల్లాడి గణేష్, పోలీసులు విస్తృతంగా గాలించారు. ఫ్రాన్స్‌తిప్ప 6వ వీధికి చెందిన నాటి దుర్గానాగలక్ష్మి అనే మహిళ చిన్నారిని అపహరించిందని నిర్ధారణ కావడంతో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించడంతో తాను బ్రహ్మపురికి చెందిన తన బంధువులైన నాటి వెంకటేశ్వర్లుకు చిన్నారి తిరుకోటి కావ్యశ్రీని రూ.30వేలకు అమ్మేశానని ఒప్పుకుంది. చిన్నారిని దత్తత ఇస్తున్నట్లు ఒప్పంద లేఖను సైతం నిందితురాలు రాయడం విశేషం. పోలీసులు చిన్నారి ఆచూకీ కోసం గాలిస్తూ, నిందితుల కాల్‌డేటా ద్వారా ఎక్కడ ఉన్నారనేది కనుగొన్నారు. అనంతరం చిన్నారిని కొనుగోలు చేసిన వారిని కపిలేశ్వరపురం గోదావరి ఏటిగట్టు సమీపంలో పట్టుకుని స్టేషన్‌కు తీసుకువచ్చారు. చిన్నారి కావ్యను తండ్రి చిరంజీవికి అప్పగించడంతో కిడ్నాప్ కథ సుఖాంతమైంది. నిందితురాలు నాగలక్ష్మి, ఆమెకు సహకరించిన మేడా వెంకన్నను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో కానిస్టేబుళ్లు కడలి శ్రీను, మల్లాడి గణేష్‌లను ఎస్పీ భక్తవత్సలం, సీఐ గూటం శివగణేష్, ఎస్సై సుబ్బరాజు అభినందించారు. అనంతరం చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ రాము, సీడబ్ల్యూఎస్ చైర్‌పర్సన్ లక్ష్మీభాయి చిన్నారితో మాట్లాడి వైద్య పరీక్షలు సైతం నిర్వహించారు.

## పీఎంఆర్‌వై గృహనిర్మాణ పథకం అమలుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అధ్యక్షుడు పెమ్మాడి తదితరులు

యానాం: నియోజకవర్గంలో ప్రధానమంత్రి గృహనిర్మాణ పథకం అమలుకు కృషి చేస్తున్నట్టు ఇప్పటికే ఎల్జీ కిరణ్‌బేడీకి ఈ విషయంపై లేఖ రాసినట్టు యానాం బీజేపీ అధ్యక్షుడు పెమ్మాడి దుర్గాప్రసాద్, సీనియర్ నేత కనకాల రామదాసు తెలిపారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివేశనా స్థల పట్టాల పంపిణీ చేస్తామంటూ గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలు చేస్తుందని కాని ఏ ఒక్కరికి పట్టాలు ఇవ్వలేదని ఆరోపించారు. పీఎంఆర్‌వై పథకం ద్వారా గృహ నిర్మాణాలు చేపట్టాలని మార్చిలో ఎల్జీ కిరణ్‌బేడీకి తాము లేఖ రాశామని, దీనికి ఆమె స్పందించి చీఫ్‌టౌన్ ప్లానర్‌కు ఆదేశాల జారీ చేశారని తెలిపారు. ఆర్‌ఏఓ సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. 2022 కల్లా యానాంలో పూర్తిస్థాయిలో గృహ నిర్మాణాలు చేపట్టాలనే ధ్యేయంతో పనిచేస్తున్నామన్నారు.

## మున్సిపల్ సమస్యలపై వినతి


పుదుచ్చేరి ఎల్‌ఏడీ కార్యదర్శి జయంత్‌కుమార్ రే తో పీపుల్స్‌ఫ్రంట్ నాయకుల సమావేశం

యానాం: స్థానిక మున్సిపాలిటీలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పుదుచ్చేరి నుంచి వచ్చిన లోకల్ అడ్మినిస్ట్రేషన్(ఎల్‌ఎడి)డిపార్ట్‌మెంట్ కార్యదర్శి జయంత్‌కుమార్ రే కు యానాం పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వెలగా రాజేశ్వరరావు ఆధ్వర్యంలోని బృందం మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూజర్ చార్జెస్, పారిశుద్ధ్య నిర్వహణ, శానిటరీ వర్కర్స్‌కు ఉపాధి, ఉపకరణాలు, యంత్రాల సమకూర్చుట, కనకాలపేటలోని డంపింగ్ యార్డు తరలింపు, మున్సిపల్ ఉద్యోగులకు గత 10 నెలల బకాయి వేతనాలు తదితర అంశాలను తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యానాం హ్యూమన్ ఫర్ సర్వీస్ అధ్యక్షుడు గుత్తుల రామారావు, సబ్బతి శ్రీనివాసరావు, పెసల వెంకటేష్, సబ్బతి లోకేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

ENADU
-9 DEC 2020

## బాలికను అపహరించి..
# తప్పుడు పత్రాలతో విక్రయించి..



తండ్రి చిరంజీవితో బాలిక కావ్యశ్రీ

**యానాం:** చిన్నారి కావ్యశ్రీ అపహరణ ఉదంతం 12 గంటల వ్యవధిలోనే సుఖాంతమైంది. ఎస్పీ ఆర్. భక్తవత్సలన్, సీఐ గూటం శివ గణేష్ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. యానాం బాల యోగినగర్ ఆరో వీధిలో నివసిస్తున్న నాటి నాగలక్ష్మి రోజూ పనికి వెళ్లే సమయంలో అదే మార్గంలో ఇంటి బయట ఆడుకుంటున్న కావ్యశ్రీని పలకరిస్తుండేది. రోజూ మాదిరిగానే సోమవారం సాయంత్రం కూడా చిన్నారిని పలకరించి తన వెంట తీసుకెళ్లింది. తన ఇష్టప్రకారమే ఆడ బిడ్డను దత్తత ఇస్తున్నట్లుగా సుబ్బారావు అనే వ్యక్తి పేరిట ఓ లేఖను సృష్టించి దాని సాయంతో తనకు పరిచయమున్న కె. గంగవరంలోని బ్రహ్మపురికి చెందిన మేడా వెంకన్నకు రూ. 30 వేలకు అమ్మేసింది. ఇదిలా ఉండగా అప్పటికే కన్నబిడ్డను కోల్పోయి బాధలో ఉండి.. డబ్బిచ్చి ఎవరైన బాలికను దత్తత చేసుకోవాలని చూస్తున్న దేవీపట్నానికి చెందిన తన బంధువుకు.. వెంకన్న కావ్యశ్రీని అప్పగించాడు. యానాంలో బాలిక అదృశ్యమైన విషయం పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో రావడంతో.. ఇష్టపూర్వకంగా ఇస్తేనే తీసుకుంటామని చెప్పినా ఎందుకిలా చేశావంటూ ఆ బంధువు వెంకన్నను ప్రశ్నించారు. దీంతో ఆయన నాగలక్ష్మిని నిలదీయడంతో ఆమె బాలికను వెనక్కు తీసుకురావాలని చెప్పింది. తర్వాత బాలిక తల్లిదండ్రులను కలిసి కావ్యశ్రీని తానే అపహరించినట్లు చెప్పడంతో పోలీసులు తమదైన రీతిలో విచారించి వాస్తవాల్ని వెలికితీశారు. పోలీసు నిలయ అధికారి రాము ఆధ్వర్యంలో క్రైం టీంతో వెళ్లి బాలికను తీసుకొచ్చారు. యానాం చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ సి. లక్ష్మీబాయి, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ రాము, అధికారి రామజోగి సమక్షంలో బాలికను విచారించారు. వైద్యపరీక్షల తర్వాత బాలికను తండ్రి చిరంజీవికి అప్పగించారు. ఈ కేసులో నిందితులైన నాటి నాగలక్ష్మి, వెంకన్నలను పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

ANDHRA JYOTHI
-9 DEC 2020

## బాలిక కిడ్నాప్ కథ సుఖాంతం



తండ్రి చెంతకు కావ్యశ్రీ

యానాం, డిసెంబరు 8: ఎర్రగుంట వారి వీధిలో కిడ్నాప్‌కు గురైన చిన్నారి ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. తిరుకోటి చిరంజీవి కుమార్తె ఐదేళ్ల చిన్నారి కావ్యశ్రీని సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో కిడ్నాప్ చేశారు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు యానాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ భక్తవత్సలన్, సీఐ గూటం శివగణేష్ ఆధ్వర్యంలో మూడు బృందాలు చిన్నారి ఆచూకీ కోసం వెతుకులాట ప్రారంభించాయి. యానాం ఫ్రాన్స్‌తిప్పకు చెందిన నాటి నాగలక్ష్మి అనే మహిళ ఈ చిన్నారిని కిడ్నాప్ చేసి బ్రహ్మపురిలోని ఆమె బంధువు నాటి వెంకన్నకు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ దేవీపట్నానికి చెందిన ఓ వ్యక్తికి బాలికను ఇచ్చేందుకు రూ.30 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే కిడ్నాప్ విషయం తెలిసిన సదరు వ్యక్తి వెంటనే బాలికను తల్లిదండ్రులకు అప్పగించాలని ఆదేశించాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు నాగలక్ష్మి, వెంకన్నను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం కావ్యశ్రీని తల్లిదండ్రులకు అప్పగించారు. మీడియా సహకారంతోనే ఈ కేసును తక్కువ సమయంలో ఛేదించామని ఎస్పీ చెప్పారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఒక మోటార్‌సైకిల్, 27 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

RAJA SAKTHI
-9 DEC 2020

# తల్లిదండ్రుల చెంతకు చిన్నారి

ప్రజాశక్తి-యానాం

యానాంలో సోమవారం కిడ్నాపైన చిన్నారి కావ్యశ్రీని పోలీసులు ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. యానాం యర్రగుంట వీధిలో మూడేళ్ల చిన్నారి కావ్యశ్రీ కిడ్నాప్ అయిన సంఘటన కలకలం రేపింది. ఇంటి వద్ద అద్దెకు నివాసం ఉంటున్న ఒక మహిళ బాలికను కిడ్నాప్ చేసినట్టు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆ మహిళను అరెస్టు చేసిన చిన్నారిని తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



చిన్నారితో తల్లిదండ్రులు, పోలీసులు

### రూ.27 వేలకు పాప విక్రయం

సోమవారం సాయంత్రం యర్రగుంట వారి వీధిలో వారి ఇంటిలో నుంచి తిరుకోటి చిరంజీవి కుమార్తె కావ్యశ్రీ అదశ్యం అయింది. కుటుంబ సభ్యులు అంతా వెతికినా కనిపించలేదు. దీంతో యానాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 24 గంటలు గడవక ముందే చిన్నారి ఆచూకీ తెలుసుకున్నారు. యానాం సిఐ గూటం శివ గణేష్ ఆధ్వర్యంలో రెండు బందాలు చిన్నారి ఆచూకీ కోసం విస్తతంగా గాలించారు. యానాం ఫ్రాన్స్ తిప్పకు చెందిన మహిళ నాడి నాగలక్ష్మి చిన్నారిని కిడ్నాప్ చేసింది. బ్రహ్మపూరిలోని బంధువులైన నాడి వెంకటేశ్వర్లుకు రూ. 27 వేలకు అమ్మివేసింది. పోలీసులు నాగలక్ష్మిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహించి తండ్రి చిరంజీవికి అప్పగించినట్టు ఎస్ఐ కట్ట సుబ్బరాజు తెలిపారు.

# ఉపకరణాలు, మాస్కులు పంపిణీ

ప్రజాశక్తి - యానాం

కేంద్ర పాలిత ప్రాంతమైన యానాంలో 300 మంది వికలాంగులకు రూ.3 లక్షల విలువైన ఉపకరణాలను పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడికృష్ణారావు అందించారు. యానాం విద్యాశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. అలాగే 8, 9, 10 తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి మాస్కులను పంపిణీ చేశారు. సర్వశిక్షాభియాన్ సిబ్బంది ఇంటింటికీ సర్వే నిర్వహించారు. కృత్రిమ అవయవాలు, ట్రై సైకిల్, వినికిడి యంత్రాలు, కళ్లజోళ్లు అవసరమైన వారిని గుర్తించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఏటా ఉచితంగా ఉపకరణాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు.